# ఆనందానికి ఆనకట్ట

భరాగో



"సోమవారం ఉదయం ఫ్లయిట్‌కి ఢిల్లీనుంచి వస్తువ్నాను. మన ఆఫీసులోనే వుంటాను. సూరజ్‌మల్, చందన్‌మల్ అని వడ్డీ వ్యాపారస్తులున్నారు. వారికి ఫోన్ చేసి ఏర్‌పోర్టుకి కారు పంపమని చెప్పాలి. ఆ రోజు స్టెనోగ్రాఫరు సెలవు పెట్టకుండా చూడాలి—

రత్నాకర్, చేర్మన్."

అది బొంబాయిలోఉన్న హెడ్డాఫీసు నుంచి టెలెక్స్ మెసేజి.

ఆనందరావు సాధారణంగా గుండె దిటవు కోల్పోడు. కాని ఇవాళ కొంచెం వణుకు వస్తోంది.

తాను పని చేస్తున్న "కె.కె. మెటల్స్ లిమిటెడ్" కంపెనీకి రీజినల్ ఆఫీసు హైదరాబాదులో పెట్టి రెండేళ్ళు దాటింది. అయినా టెలిఫోన్ స్థాయి దాటి టెలెక్స్ స్థాయికి రాలేదు.

శనివారం రాత్రి ఎనిమిదింపావుకి, ఎదురింట్లో వున్న ప్రభుత్వ యాజమాన్య సంస్థ ఆఫీసు (కమ్- మేనేజింగ్ డైరెక్టర్ రామనాధన్ ఐ.ఎ.ఎస్.గారి నివాసం) చేరింది టెలెక్స్. శనివారం రాత్రి తను. తన ఆఫీసు (కమ్- రెసిడెన్స్- కమ్ గెస్ట్‌హౌస్) చేరేసరికి పదకొండు గంటలు దాటింది. ఆదివారం ఉదయాన్నే రామనాధన్‌గారు కుటుంబాన్ని తీసుకుని స్వయంగా కారు నడుపుకుంటూ వెళ్ళిపోయాడట వాళ్ళ వాచ్‌మన్ చెప్పాడు, తను టెలిఫోన్‌కోసం అడిగితే. ఆయన రాత్రి ఏ పదింటికో వచ్చినట్టుంది....

అలా, శనివారం రాత్రి చేరిన టెలెక్స్ తను ఇప్పుడు- అంటే సోమవారం ఉదయం చూస్తున్నాడు.

ఢిల్లీ ఫ్లయిట్ మరో నలభై అయిదు నిమిషాల్లో బేగంపేట ఏర్‌పోర్టుకి చేరుకుంటుంది—

ఫోన్ చెయ్యాలి. వాడెవడో వడ్డీ వ్యాపారస్తుడికి—

ఫోన్ ఆర్డర్లో కొచ్చిందో. లేదో; నిన్నంతా ఔట్.

వెన్నుపూస చల్లబడింది ఆనందరావుకి.

"చిన్న బాస్" రత్నాకర్ బాబు "కట్ అండ్ డ్రై" అని విన్నాడు.

గబగబా ఫోన్ దగ్గిరికి పరుగెత్తాడు.

ఏం అదృష్టం! ఫోన్ పనిచేస్తోంది!

"హాఁజీ. హాఁజీ!......... కారు బయల్దేరింది!.... నాకు నిన్న ఉదయం ఢిల్లీలో తగిలాడు రత్నాకర్ బాబు.... సారీ....మీరు కూడా ఏర్‌పోర్ట్‌కి వెళ్ళగోరుతారని నాకు ఆ క్షణంలో తట్టలేదు. లేకపోతే ఏముంది కష్టం. అమీర్‌పేటలో ఆగి మిమ్మల్ని తీసుకెళ్ళడానికి!.... విష్ యు ఆల్ ద బెస్ట్!"

స్టెనోగ్రాఫర్ లలిత — అంబర్‌పేటలో వుంటుంది.... వాళ్ళింట్లో టెలిఫోన్ లేదు గాని. ఇవతలి ఇంట్లోనూ. అవతలి ఇంట్లోనూ కూడా వున్నాయి.

"పీకలమీదికి వస్తే తప్ప ఫోన్ చెయ్యకండి సార్.రాత్రనక. పగలనక మీరు ఫోన్ చెయ్యడం. నేను ఉన్నదాన్ని ఉన్నట్టుగా బయల్దేరిరావడం.... చుట్టుపట్ల అంతా గొడవగా వుంది!" అని చెప్పింది.

పీకల మీదికే వచ్చిందిగా!

"సెలవు పెట్టకండా చూడాలి" అనే వుంది టెలెక్స్‌లో....

లలిత కేదైనా పనివుంటే సెలవే మీ పెట్టదు. ఆ పని అయిపోయేవరకు ఆఫీసుకి రాదు. అంతే! మర్నాడో. మూడోనాడో రొప్పుకుంటూ వచ్చి. అందులోంచి చిరునవ్వులు వొలకబోస్తూ "సారీ. బాస్!" అనేసి అటెండెన్స్ రిజిస్టర్‌లో చిన్న చిన్న ఆటోగ్రాఫులు ఎన్ని బాకీవుంటే అన్నీ వేసేస్తుంది. తను లలితని ఏమీ అనలేదు.

"నువ్వు వెంటనే ఆటోయెక్కి వొచ్చెయ్యాలి. చిన్న బాస్ రత్నాకర్ బాబు ఈ పాటికి ఫ్లయిట్ దిగివుంటాడు. తొలిసారిగా మన ఆఫీస్ కొస్తున్నాడు. రాగానే స్టెనోగ్రాఫర్ అవసరమని టెలెక్స్‌లో ప్రత్యేకంగా వుదహరించాడు....సారీ ఫర్ ది ట్రబుల్!"

అంబర్‌పేటనుంచి అమీర్‌పేట-ఎలాగా పదైపోతుందేమో.

* * *

"నైస్ జాయింట్ వుయ్ హావ్ హియర్!"

రెండో అంతస్తులో చేర్మన్ గారికి ప్రత్యేకంగా వుంచిన డీ-లక్స్ (ఎ. సి)-సూట్‌లో; స్నానానంతరం "బ్రేక్ ఫాస్ట్" చేసి. టీ పుచ్చుకుంటూ అన్నాడు రత్నాకర్ బాబు.

నాలుగు నెలల కిందట చనిపోయిన బడా బాబు పోలికల కోసం అతనిలో వెతుకుతూ "ఎస్.సార్." అనడం కూడా మరిచిపోయాడు ఆనందరావు.

"ఓకే. మనం ఈ మధ్యాహ్నం ఫ్లయిట్‌లో వైజాగ్ వెడుతున్నాం. విజయవాడ ఏర్‌పోర్ట్‌లో (అదే గన్నవరం అంటార్టగా) తారాచంద్ కలుస్తారు. ఎస్. ఆర్. గోగినేని కూడా.... మన ఫ్యాక్టరీకి కావలసిన ఖనిజాన్ని విజయవాడ ప్రాంతం నుంచి సరాసరి బొంబాయికి లారీల మీద చేరవెయ్యడానికి కాంట్రాక్ట్ యిమ్మని గోగినేనిగారు అడుగుతున్నారు. ఈ డీల్ సెటిలైతే మనకి బోలెడు తలనొప్పి తగ్గడమేకాకండా ఏడాదికి ఓ లక్ష రూపాయల దాకా రవాణా ఖర్చుల తేడా రూపంలో ఆదా అవుతాయి. తారాచంద్‌గారు వాళ్ళ రాజమండ్రి ఫ్యాక్టరీకి కావలసిన లోహం అంతా; సోహన్‌లాల్ కంపెనీతో తెగతెంపులు చేసుకుని మన దగ్గరే కొనడానికి ఇంచుమించు అంగీకరించినట్టే. పదేళ్ళకి కాంట్రాక్ట్ రాయమంటున్నాం మనం. వారు అయిదేళ్ళకి రాస్తామంటున్నారు. ఏ ఏడేళ్ళ కాంట్రాక్ట్‌గానో ఇది సెటిలవుతుందని అనుకుంటున్నాను నేను. ఇహ. మిత్తల్ గారనే ఆయన వైజాగ్‌లో కొత్తగా ఒక షిప్పింగ్ కంపెనీ పెట్టారు. వారు మన లోహానికి ఒక ప్రత్యేక స్థాయి కల్పించినట్లయితే ఎగుమతిచేసే అవకాశాలున్నాయని శాంపిల్సు వైజాగ్‌లో కార్గో సర్వేయర్స్ దగ్గిర పరీక్షించుకోవలసిందనీ ఆహ్వానించారు.... ఈ మూడు వ్యవహారాలూనూ. ఈ ట్రిప్పులో నా ధ్యేయాలు. ఎగుమతి వ్యవహారాలకి సంబంధించిన కొన్నిఏర్పాట్లు మన కనుకూలంగా చేస్తామని నిన్న ఢిల్లీలో మెహ్‌తాగారు నాకు మాట ఇచ్చేరు........ మీరు సంతోషిస్తారు కదా అని ఇవన్నీ మీకు చెబుతున్నాను!"

"థాంక్యూ సార్. కాని మనం వైజాగ్ ఇవాళ కాకండా రేపో. ఎల్లుండో వెడితే మరింత సానుకూలంగా ఉంటుందని తమకు మనవి చేస్తున్నాను."


"ఏం. ఫ్లయిట్ దొరకదా?" కళ్ళు పన్నగా చేసి అడిగాడు రత్నాకర్.

"నో సార్. ఫ్లయిట్ దేముంది నిమిషం పని! కాని. ఇక్కడి కెలాగూ వచ్చేరుకదా. ఇక్కడ మీరు ఒక రోజైనా వుంటే నేను లోగడ మార్కెట్ సర్వే చేసి తమకు కూలంకషంగా నివేదికలు పంపుకున్న బాపతు ఐదారు వ్యవహారాలు తమర్నే మనకి లాభసాటి అని తోచినరీతిని చక్కబెట్టేసి వెళ్ళొచ్చుకదా అని నాఅభిప్రాయం సార్. వాటికి తగిన పునాదివేసే వుంచాను మరి!"

"మంచిదే....సరే బెజవాడకి ఫోన్‌చేసి తారాచంద్‌గార్ని. గుంటూరికి ఫోన్‌చేసి గోగినేనిగార్ని నాతో మాట్లాడమనండి.... నా బ్రీఫ్‌కేసులో ఇవాళ ఫ్లయిట్‌కి వైజాగ్ టిక్కెట్టుంది.కాన్సిల్ చేయించండి.బైదిబై మీరు ప్రాజెక్ట్ చేస్తున్నది ఎన్ని కాంట్రాక్టులు?"

"అయిదు ఓ.కే. స్టేజిలో ఉన్నాయి సార్. ఆరోది కొంచెం వూగిసలాడుతోంది. అయినా మీరు స్వయంగా టాకిల్ చేసి షరతుల్లో సముచితమైన సర్దుబాట్లు చేసుకుంటూ నిర్ణయాలు తీసుకుంటే అది కూడా సెటిలైపోతుందని నా నమ్మకం సార్. ఈ ఆరూ కలిసి ఏడాదికి ముప్ఫయ్యయిదు లక్షల రూపాయల టర్నోవర్ తెస్తాయని నా అంచనా. రిపోర్టులో వివరాలూ. కారణాలూ తమకి మనవి చేసుకున్నాను సార్."

"చూశాను. చూశాను!" అని కుడిచేతి వేళ్ళతో కుర్చీ చేతిమీద లయలఘువులు వేయసాగాడు రత్నాకర్.



"ఎక్స్‌క్యూజ్‌మీ సర్." ఒక మెత్తని గొంతు తెర అవతలి నుంచి వినిపించింది. "మే ఐ కమిన్ సార్?"

"కమిన్, లలితా!" అన్నాడు ఆనందరావు.

లలిత లోపలికొచ్చింది. చేతిలో షార్ట్‌హాండ్ పుస్తకం, పెన్సిలూ. వాటినలా ఎత్తిపట్టుకునే, తను కొద్దిగా వంగి, రత్నాకర్‌కి నమస్కారం చేసింది.

"ఈమె శ్రీమతి లలిత సార్; ఇక్కడ మన స్టెనోగ్రాఫరు తమరు సెలెక్ట్ చేసే జిలో స్టెనోగ్రాఫర్. గురించి ప్రత్యేకంగా ఉదహరించారు కదా అని; వెంటనే రమ్మని కబురు చేశాను సార్." అని; గదిలో మూలన ఒక టేబిల్ మీద వున్న బిజినెస్ కాగితాల బ్రీఫ్‌కేసు తెచ్చి రత్నాకర్ ముందున్న టిపాయ్ మీద పెట్టి, తెరిచాడు ఆనందరావు. "మీకు అర్జంట్ లెటర్స్ ఏవైనా వుంటే డిక్టేట్ చేస్తూ వుండండి సార్. నేను తారాచంద్‌గార్ని, గోగినేని గార్ని ఫోన్‌లో పట్టుకుంటాను.... ఇదుగో సార్, ఇదేగా, తమ ఫ్లయిట్ టికెట్, వైజాగ్‌ది-దీన్ని ఎల్లుండికి మార్పించేస్తాను సార్...." అని రత్నాకర్ వైపు చూడకుండా లేచి వెళ్ళబోయాడు ఆనందరావు.

రత్నాకర్ కూడా- నిజానికి ఇంతసేపూ ఆనందరావు వైపు చూడలేదు. కాని, అతను వెళ్ళిపోతే? కళ్ళు జిగేల్ మనిపిస్తున్న ఈ సౌందర్యరాశిని తానొక్కడే చూస్తూ భరించలేడేమో అన్న అనుమానం వున్నట్టు! "ఆ లెక్కని మనం దిగువని ఆఫీస్ రూమ్‌లోనే కూర్చోవచ్చు కదా" అన్నాడు.

ఆనందరావు నవ్వాడు. "ఇదంతా మీ ఆఫీసే కదా సార్! అయితే అక్కడ మీరింత విశ్రాంతిగా కూర్చోడానికి అవకాశం ఉండదేమో సార్. అయినా తమ యిష్టం సార్."

"ఓకే, ఓకే దెన్!"


"క్షమించాలి శ్రీమతి లలితా. ఫలహారం అదీ అయిందా, అది చెప్పండి ముందు!" అన్నాడు ఆనందరావు.

"ఫర్వాలేదులెండి సార్" అన్నది లలిత, మెత్తగా నవ్వేస్తూ.

"అది కాదు; నేను చెప్పేది వినాలి. చేర్మన్‌గారు నిన్నా మొన్న ఢిల్లీలో ఉండి, మన కంపెనీకి సంబంధించిన కొన్ని చాలా ముఖ్యమైన పన్లు చక్కబెట్టుకొచ్చారు. ఆ సందర్భంగా కనీసం అరడజను లెటర్స్ చెబుతారనుకుంటాను. మీకు మళ్ళా పదకొండు గంటలు దాటేవరకు ఊపిరి సలపదు అంచేత—"

"పోనీ, ఆవిడకి బ్రేక్‌ఫాస్ట్ ఇక్కడికే పంపండి" అని సలహా ఇచ్చాడు రత్నాకర్.

"అదే సార్, నే నంటున్నదీనూ. మీరు యిందాకనే అన్నారు కదా, ఇది ఆఫీస్‌రూమ్ కాదని! నిజానికి నేనెప్పుడూ ఆవిణ్ణి కేవలం ఒక ఉద్యోగస్తురాలుగా చూడలేదసలు. ఆ మాటకొస్తే ఆవిణ్ణే కాదు, ఎవర్నీనీ. ఏ పని చేసినా కంపెనీ బాగుకోసమే కదా చేస్తాం! అందుకని ఈ ఆఫీస్‌ని యాంత్రికమైన నిబంధనలతో నడపడంలేదు నేను!" అన్నాడు ఆనందరావు.




"ఎస్, యెస్!" అని ఆనందరావుకి చెయ్యివూపాడు రత్నాకర్. "సరిగ్గా నే ననుకుంటున్నదీ అదేకదా!" అనుకున్నాడు.

* * *

శ్రీ వి. సచ్చిదానందరావుగారికి
పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్,
రీజియనల్ ఆఫీసు,
హైదరాబాదు.

డియర్ సర్,

మీరు మా కంపెనీకి గత ఆరు నెలలుగా చేస్తూ వుండిన సేవలను మిక్కిలి విశ్వాసంతో మేము సదా గుర్తుంచుకుంటాము.

మా కంపెనీకి హైదరాబాదులో ఒక ప్రాంతీయ ఆఫీసును రెండేళ్ళనాడు ప్రారంభించినప్పుడు, ప్రస్తుతం మీరు నిర్వహిస్తూ వున్న బాధ్యతలను నిర్వహించేదానికి శ్రీ కె. ఎన్. జగన్నాథ్‌గారిని నియమించారని మీకు తెలుసు. వారు మా కంపెనీని గురించి ఇక్కడి అధికారుల మనస్సుల్లో, వ్యాపారజ్ఞుల పరిధుల్లో నెలకొల్పిన సదభిప్రాయాలూ సత్సంబంధాలూ కూడా మాకు మరింతగా చిరస్మరణీయమైనవి.

ఇటీవల మీరు, మీ వ్యక్తిగత జీవితంలోనే కాక, మా కంపెనీ వ్యాపారాభివృద్ధి, తదితర విషయాలలో కార్య నిర్వహణ నిమిత్తం కూడాను, మిక్కిలి దుష్టం, హేయం, నీచం అయిన మార్గాలను అనుసరిస్తున్నారని, వ్యాపార రీత్యానూ బంధుత్వం రీత్యానూ మా కంపెనీతో, మాతో, సంబంధాలు కలిగిన సంస్థలద్వారా, వ్యక్తులద్వారా మాకు విశ్వసనీయంగా తెలియవస్తూ వుంది.

మీకు ఉద్యోగం ఇచ్చినప్పటి మా కంపెనీ చేర్మన్, మా తండ్రిగారు కీర్తిశేషులు శ్రీ రాధాకాంత్‌గారు, మా ఉద్యోగిగా మీకు మా కంపెనీద్వారా కొంత గౌరవం, కొన్ని హక్కులు, సదుపాయాలు సంక్రమిస్తాయని; వాటిని మీరు సక్రమంగానే, కంపెనీ మేలుకోసం మాత్రమే వినియోగించవలసి వుంటుందని మీకు వ్రాతమూలకంగా తెలియపరచి వున్నారు. అంతేకాక; మీ ఉద్యోగ విధినిర్వహణలో ప్రాలుమాలిక, నిర్లక్ష్యం, దోషం వున్నవని ఒక ఏడాది లోపల మాకు నమ్మకం కలిగితే ఒక నెల నోటీసుతోను; ఆ తరువాత అయితే మూడు నెలల నోటీసుతోను మిమ్మల్ని ఉద్యోగం నుంచి తొలగించడానికి అభ్యంతరం వుండకూడదని ఒక ద్వైపాక్షిక అంగీకార పత్రంపైన; మీరు మా కంపెనీలో చేరిన దినాన్నే సంతకాలైనాయి.

పైన చెప్పిన రెండు పత్రాలు మీదగ్గిర కూడా వున్నట్టు మా దగ్గర దాఖలా వున్నది కనుక, వాటి నకళ్ళు జతపర్చడం లేదు.

కనుక ఈ లేఖ మీకు అందిన ఒక నెల దినాల అనంతరం ఒకనాడు మిమ్మల్ని మా కంపెనీ ఉద్యోగం నుంచి తొలగిస్తామని ఇందుమూలముగా గ్రహించమని కోరుతున్నాము. తొలగించబడడం మీకు అంగీకారం కాకపోతే, (తత్సంబంధమైన షరతులకు లోబడి) రాజీనామా చేసి వెళ్ళిపోయే స్వాతంత్ర్యం మీకు వున్నదని మేమున్నూ గ్రహిస్తున్నాము.

గౌరవ పురస్సరంగా,

తమ స్నేహపాత్రుడు,
కె. కె. రత్నాకర్,
చేర్మన్.

"దీంతో ఆరు లెటర్స్ అయ్యాయి. అవునా?" అని అడిగాడు రత్నాకర్. లలిత

కళ్ళలోకి చూస్తూ.

"మరేంది. ఇంకా వున్నాయాండీ ?"

"ఇంతే ఇప్పటికి." అని. "ఆనంద రావు యామైనట్టు?" అన్నాడు.

లలిత లేచింది. గదిలో ఒకమూలనున్న టేబిల్‌మీద పెట్టిన టెలిఫోన్ తెచ్చి రత్నాకర్ ముందున్న టీపాయ్‌మీద పెట్టింది. రిసీవర్ ఎత్తి, ఒక బటన్‌నొక్కి. అవతలి నుంచి స్వరం రాగానే "సార్, చేర్మన్‌గారు మిమ్మల్ని అడుగుతున్నారు సార్" అని చెప్పింది. అట్నుంచి జవాబు రాగానే ఫోన్ పెట్టేసి "వస్తున్నారు సార్" అంది.

"ఇలా చూడు!" అన్నాడు రత్నాకర్ ఒకవేలితో రాకాయిస్తూ. "ఆనందరావుకిచ్చే లెటర్ చాలా గుట్టుగా వుంచాలి. తెలిసిందా? అఫ్‌కోర్స్, అతనికి యిచ్చేసేదే. నేనే ఇస్తాను. కాని ఆ ఉత్తరం అతని చేతిలో పడేవరకు, అతనికి ఆ ఉత్తరం సంగతిగాని అందులో ఏ ఒక్క అక్షరంగాని తెలియడానికి వీల్లేదు. అలా తెలిసిందని నాకు తెలిస్తే నువ్వే చెప్పావని నేను భావించవలసి వస్తుంది. తెల్సిందా ?"

"తెలిసింది సార్."

ఒక నిమిషం గడిచేలోగా ఆనందరావు వచ్చాడు.

"నువ్వు వెళ్ళి ఆ లెటర్స్ అన్నీ వీలైనంత నీట్‌గా టైప్ చేసి తీసుకురా. ఒక్కొక్క లెటర్‌కి ఒక్కొక్క కొత్త కార్బన్ ఉపయోగించు. ఒక గంటలో అయిపోతాయిగా" అన్నాడు రత్నాకర్ లలితతో.

"యస్. సార్." అని తాను నిలువెల్లా వణికిపోతూ కూడా ఆనందరావువైపు జాలిగానే చూస్తూ వెళ్ళింది లలిత.

* * *

"కె. కె. మెటల్స్ లిమిటెడ్" చేర్మన్ రత్నాకర్ ఆ మధ్యాహ్నం ఆనందరావు తయారుచేసిన నివేదికలను సాకల్యంగా పరిశీలిస్తూ కూర్చున్నాడు.

* * *

రత్నాకర్ రాజస్థానీయుడు.

ప్రపంచంలో అన్నిదేశాల్లోను ఎక్కువగానే అవసరంపడే మెటల్ షీట్లు తయారు చేస్తుంది "కె. కె. మెటల్స్ లిమిటెడ్" సంస్థ.

ఫ్యాక్టరీ బొంబాయిలో ఉంది.

రత్నాకర్ తండ్రి రాధాకాంత్, ఆ ఫ్యాక్టరీని సుమారు ముప్ఫయ్యయిదేళ్ళ క్రిందట ఒక విదేశీయుడిదగ్గిర కొన్నాడు. అయితే అప్పుడు కొన్నదీ ఇప్పుడక్కడ ఉన్నదీ ఒకటి కానేకాదు. భౌతిక స్వరూపం మారింది. అంతర్గత స్వభావం, ధ్యేయం కూడా మెరుగుపడ్డాయి.

రత్నాకర్‌కి చిన్నతనంలోనే తల్లి పోయింది. రాధాకాంత్ మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. రాజస్థానీ భాష తప్ప మరోటి మాట్లాడడం కూడా నేర్వని రాధాకాంత్; ఫ్యాక్టరీని క్షుణ్ణంగా అర్థం చేసుకోడానికి, వర్కర్స్‌గాని మేనేజర్‌గాని ఎకౌంట్స్ వాళ్ళుగాని తనని మోసం చెయ్యకుండా చూసుకోడానికి యంత్రాలు పనిచేసే విధానం దగ్గర్నుంచి లెడ్జర్లలో, రిపోర్టులలో వ్రాసే సమాచారం వరకు దీక్షగా అన్నీ అవలోకనం చేసుకొని, ఈ ఫ్యాక్టరీకి నేను పెట్టుబడిదారుణ్ణి మాత్రమే కాదు, యజమానిని కూడాను అనిపించుకున్నాడు.

రత్నాకర్ మద్రాసులో (మేనత్తగారి ఇంట) పెరిగాడు. ఇంట్లో రాజస్థానీ, బడిలో ఇంగ్లీషు; సహాధ్యాయులతో తమిళం మాట్లాడుతూ. ఎప్పుడూ స్కూల్‌ఫస్టు. తప్పితే క్లాస్ ఫస్టు వచ్చేవాడు. పి. యు సి. తరవాత మెటలర్జీ చదివాడు.


క్రమంగా ఫ్యాక్టరీ పెద్దదైంది. ఉత్పత్తి చేసే సరుక్కి గిరాకీ పెరిగింది. భారీగా పెట్టుబడి పెట్టడానికి బ్యాంకులు ముందుకొచ్చాయి. సంస్థ లిమిటెడ్ కంపెనీగా రూపు దిద్దుకుంది. బోర్డ్ (ఆఫ్ డైరెక్టర్స్) ఏర్పడింది. కార్మికుల, ఉద్యోగుల సంఖ్యలు హెచ్చాయి.

అవన్నీ అలా వుండగా దక్షిణభారతంలో ఇప్పుడిప్పుడే పారిశ్రామికంగా ముందడుగు వేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తిచేసే లోహపు రేకులను రకరకాలుగా ఉపయోగించగల చిన్నతరహా పరిశ్రమలు మొగ్గ తొడిగాయి.

ఎనిమిదేళ్ళనాడు ఒకానొక "రాజస్థానీ మహాసదస్సు"లో పాల్గొనడానికి యాథాలాపంగా హైదరాబాదు వచ్చిన రాధాకాంత్ ఆంధ్రప్రదేశ్ అనే ఈ "వర్జిన్ ఏరియా"ని తన వ్యాపార సామ్రాజ్యంలో కలుపుకోవాలని ప్రణాళిక వేసి, ప్రత్యేకం నిపుణుల ద్వారా 'మార్కెట్ సర్వే' చేయించి, రేకు తయారు చెయ్యడానికి కావలసిన లోహం కూడా (కొద్దిపాటి అయినాసరే) తామే ఉత్పత్తి చేస్తే ఇంతకు మరింత గిట్టుబాటుగా వుంటుందని రూఢి చేసుకుని, నాలుగేళ్ళ క్రితం తన కంపెనీని అందుకున్నా సిద్ధం చేశాడు.

రెండేళ్ళనాడు హైదరాబాదులో ప్రాంతీయ కార్యాలయాన్ని నెలకొల్పాడు. ఈ భవనంలో ఆఫీసుకి, వాచ్‌మన్, ప్యూన్స్ మొదలైన అత్యవసర సిబ్బంది నివాసానికి; అతిథి గృహానికి; కాక చేర్మన్ వస్తే వుండడానికి కూడా వసతి వుంది. దీన్ని పాతికేళ్ళకు లీజుకుతీసుకున్నారు. ఒక పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు, ఒక ఇన్వెస్టిగేటర్, ఒక లేడీ స్టెనో, ఇద్దరు ప్యూన్లు, ఒక వాచ్‌మన్ (కమ్) మాలి — ఇలా సిబ్బంది నియమితులయ్యారు. బొంబాయి ఆఫీసులో అకౌంట్స్‌లో పదిహేనేళ్ళుగా వున్న జగన్నాథ్‌ని తొలి పి. ఆర్. ఓ. గా హైదరాబాదు ప్రాంతీయ కార్యాలయంలో వేశారు.

జగన్నాథ్ మాతృభాష తమిళం. అతని తండ్రి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో అధికారిగా కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల్లో పని చేసి వుండడాన్ని జగన్నాథ్‌కి కన్నడ, తెలుగు భాషల్లో కూడా ప్రవేశం సాధ్యమైంది. అతడు ఇంగ్లీషు ధారాళంగా వ్రాయగలిగేవాడు, మాట్లాడగలిగేవాడున్నూ. సద్బుద్ధితో, సత్ప్రవర్తనతో, నిజాయితీతో ఎదుటివ్యక్తిని మెప్పించడం; రాత్రనక పగలనక చేతిలో వున్న పని అంతా పూర్తి చేస్తేనేగాని అన్నం నిద్రా అనకపోవడం అతని లక్షణాలూ అర్హతలూనూ. అయినా, వ్యాపారం వృద్ధిచేయగల పట్లు మాత్రం ఎందుకనో తెలుసుకోలేకపోయాడు. సాధారణంగా కాగితాల మీద బుద్ధిపూర్వకంగా



చూపించే నష్టాలు నిజంగా సంభవించడం మొదలై, హైదరాబాదు ఆఫీసు కంపెనీకి తలకాయనొప్పిగా పరిణమించింది. అప్పుడు పత్రికలో ప్రకటనవేసి ఆనందరావును ఎన్నికచేశారు. ఇదిజరిగి ఆరునెల లయింది. ఆ తరువాత రెండునెలలకే రాధాకాంత్ మరణించాడు.

మెటలర్జీ చదివిన రత్నాకర్, ఎం.బి.ఏ. చేసి మెటల్‌బాక్స్ కంపెనీలో బిజినెస్ అప్రెంటిస్ చేస్తూ వున్నకాలంలో రాధాకాంత్ మరణించడంతో, డైరెక్టర్ల కోరికపై "కె. కె. మెటల్స్ లిమిటెడ్"కి చేర్మనుగా పదవీస్వీకారం చేశాడు. ఊపిరిసలపని కార్మిక సమస్యలతో సతమతమై ఎంత కోరికవున్నా హైదరాబాదు రానేలేకపోయాడు ఈ నాలుగు నెలలుగానూ.

కాగితాలు క్షుణ్ణంగా పరిశీలించడంలో రత్నాకర్, తాను విన్నదానికి భిన్నంగా, ప్రతి కేసులోను ఆనందరావు చేసిన గొప్ప కృషిని గుర్తించి కొంత ఊరట చెందాడు. లంచగొండితనం, మద్యపానం, వ్యభిచారం మొదలైన ఆయుధాలతో అతను ప్రభుత్వ అధికారులను, తద్వారా ప్రయివేటు వ్యాపారస్తులను వశపరచుకుని వ్యాపారాభివద్ధి సాధిస్తున్నంత వేగంగాను కంపెనీ పేరు ప్రతిష్ఠలను మంటగలుపుతున్నాడని రత్నాకర్ చెవినీ పడింది, ఉత్తరాల రూపంలో కంటనూ పడింది. పైగా ఆ కారణాలు వ్రాయడానికి వీలులేదు. కనుక ఖర్చు పెట్టిన కంపెనీ సొమ్మంతా, "సాదరు, ప్రయాణ భత్యాలు" అని చూపించడంతో ఆడిట్ అభ్యంతరాలు వచ్చేస్తున్నాయి.

నిన్న ఢిల్లీలో మెహ్‌తా గారింట జరిగిన చర్చలో, ఆనందరావును గురించి మెహ్‌తా గారు, ఆయన అతిథులూ వెలిబుచ్చిన అభిప్రాయాలు వినేసరికి రత్నాకర్ చాలా సిగ్గుపడ్డాడు. "సచ్ఛీల వంతుడైన నీ తండ్రి స్వర్గలోకం నుంచి-బాబూ ఆ దుష్టుణ్ణి మన సంస్థ నుంచి తప్పించు- అని కలలో కూడా నీకు చెప్పడం లేదా" అని వాళ్ళు నిలదీశారు.

* * *

"మిస్టర్ ఆనందరావ్, మీకు పెండ్లయిందా ?"

"ఎస్ సార్, అయింది సార్."

"పిల్లలా ?"

"ఇద్దరు సార్. ఒక పాప, ఒక బాబు— సార్."

"తల్లి దండ్రులున్నారా ?"


"మా అమ్మ వుంది సార్."

"పెళ్ళికాని చెల్లెళ్ళు, ఉద్యోగాలు రావలసిన తమ్ముళ్లు ?"

"లేరుసార్."

"స్వంత ఇల్లుందా ?"

"ఎస్, సార్."




"ఎక్కడ ?"

"శ్రీకాకుళంజిల్లా; నర్సన్నపేట తెహసిల్."

"అడుగుతున్నానని వేరే విధంగా అనుకోకండి. మీరు బ్రామిన్సా ?"

"నో, సర్."

"శ్రీకాకుళం అంటే వెనుకబడిన ప్రాంతం అంటారే. మరి మీరు ఇంగ్లీషు, హిందీ కూడా ధారాళంగా మాట్లాడను, వ్రాయను గలుగుతున్నారు. ఇదెలా సాధ్యమైంది?"

"ఇక్కడికొచ్చేవరకు నేను, మార్వాడీలు ఓనర్లుగా, బెంగాలీలు కాంట్రాక్టర్లుగా వున్న జనపనార మిల్లులో పర్చేజ్ ఆఫీసర్‌గా పని చేశాను సార్. వాళ్ళు నన్ను రాష్ట్రం అంతటానూ కలకత్తా, బొంబాయివంటి నగరాలకున్నూ తరుచు టూర్ వెళ్ళమనేవారుసార్. పదిచోట్లకి వెళ్ళి పదిమందిని కలవడంతో-"

"ఐసీ- మిగిలిన మన సిబ్బంది, ఎవరెవరు ?"

"ఇన్వెస్టిగేటర్ రంగనాథ్‌ని మీరు ఇదివరకే ఎరుగుదురు సార్. అతను బొంబాయి ఆఫీస్‌నుంచి యిక్కడికి రెండునెలల కిందటే వచ్చాడు."

"ఔనౌను. తరువాత ?"

"స్టెనోగ్రాఫర్ శ్రీమతి లలిత సార్. ఆవిడ నాకంటె ముందుగానే యిక్కడ చేరింది. అంబర్‌పేటలో కాపురం. భర్త ఈ వూళ్ళోనే ఒక పెద్ద మెకానికల్ ఫర్మ్‌లో పనిచేస్తూ వుండేవాడు."

"పోయినాడా ?"

"లేదు సార్. అవిటివాడయ్యాడు. రెండు కాళ్ళూ పోయాయి-మెషిన్‌లోపడి."

"అయ్యయ్యో పాపం!" అని నిట్టూర్చి, "ఆవిడ మంచి వర్కర్‌లాగా, కంపెనీకి పెద్ద ఎసెట్‌లాగా తోస్తుంది!"

"అక్షరాలా సార్."

"పిల్లలా?"

"లేరు సార్. ఈవిడ ఆయనకి మూడో భార్య. అంతకు ముందు కూడా ఆయనకి బిడ్డల్లేరు."

"ఐసీ— అంటే ఈవిడకి వయస్సే మాత్రం ఉంటుంది?"

"ఇరవై ఆరు సార్."

"చాలా దీనగాథ కదూ?"

"అవును సార్. పేద కుటుంబం నుంచి వచ్చింది పాపం. మూడో పెళ్ళి వాడైనా భర్త కాస్త తిండీ గుడ్డా పెట్టగలవాడని పెళ్ళికి వొప్పుకుంటే ఇలా అయింది."

"మీరు మీ కుటుంబాన్ని ఇప్పుడప్పుడే ఇక్కడికి తీసుకువచ్చే ఉద్దేశంలో లేరా?"

ఫోన్ మ్రోగి, ఆ ప్రశ్నకు సమాధానాన్ని ఆపేసింది.

రత్నాకర్ స్వయంగానే తీశాడు. కొంతసేపు అవునని, అదేనని చెప్పి, మరికొంతసేపు ఊఁకొట్టి, తనెవ్వరో అవతలి మనిషికి చెప్పి, "నేనే వస్తాను. రాత్రి ఎనిమిది గంటల్లోగా రాలేను. ఈ జంటనగరాలలో మా వ్యాపారాన్ని పెంచుకోడానికి మాకు తోడ్పడతామని ముందుకొస్తున్న కొందరు వ్యక్తుల్ని చూడ్డానికి ఇప్పుడే బయల్దేరుతున్నాను. ఎనిమిది గంటలకి నువ్వు ఎక్కడ వుంటావో చెబితే ఫోన్ చేసి వస్తాను." అని అవతలి మనిషి చెప్పిన ఫోన్ నెంబరు, అడ్రసు వ్రాసుకున్నాడు.

* * *

"నేను తిరిగి వచ్చేసరికి చాల ఆలస్యం కావచ్చు. నా చిన్ననాటి స్నేహితుడొకడు ఐ.ఎ.ఎస్. అయి, ఇక్కడ సెక్రటేరియట్‌లో వున్నాడు. అతను నన్ను భోజనానికి పిల్చాడు. పిక్చర్‌కెడతామేమో తెలీదు. పన్నెండు గంటల ప్రాంతంలో వాచ్‌మన్‌ని మెయిన్‌గేట్ మీద దృష్టి పెట్టుకోమనండి-" అన్నాడు రత్నాకర్, రాత్రి ఏడున్నరకి ఆనందరావును గెస్ట్‌హౌస్ దగ్గర విడిచిపెడ్తూ.

"అలాగే సార్. థాంక్యు సర్."

ఆనందరావు లోపలికి వెళుతూనే వాచ్‌మన్‌ని పిలిచి తనకి భోజనం హోటల్ నుంచి తెమ్మని పంపాడు. ఆఫీసు రూం తెరిచి, లలిత టేబిలు, ట్రేలు పరిశీలనగా చూసి, కొంతసేపు వెతికి, ఉదయం లలిత టైపు చెయ్యడానికి ఉపయోగించిన కార్బన్ పేపర్లను పట్టుకున్నాడు. అందులో తనను ఉద్దేశించి వ్రాసిన లెటర్ సులువుగా చదివేసుకున్నాడు.

"ఇదా సంగతి, నాయనా?" అని పైకే అన్నాడు.

ఫోన్....

"హలో, కె. కె. మెటల్స్ రీజనల్ ఆఫీస్."

"నేను సేలం మాట్లాడుతున్నాను.ఆనందరావేనా?"

"యస్. సార్. నమస్కారం సార్."

"కులాసా?"

"యస్ సార్."

"ఏదీ మీ బాస్?"

"ఇప్పుడే బైటికెళ్ళారు సార్....కొంప దీసి ఆయన్ని భోజనానికి పిల్చింది మీరే నేంటి సార్?"

నవ్వు. "ఇందులో ఎవరికొంపా తియ్యడం లేదే!"

"సరే సార్. మీరు సెక్రెటేరియట్‌కి మారిపోయారా సార్? నాకు తెలీదే?"

"లేదే!"

"మరి మా బాస్ అలాగన్నారే!"

"పోన్లే, ఆ వూసెందుక్కానీ— పోతే నీతో పని పడిందయ్యా."

"చెప్పండి సార్."

"మీ బాస్‌ని డిన్నర్‌కీ, పార్టీకి పిల్చాను. ఈ రాత్రికి కొంచెం డిక్టేషన్ ఉంటుందేమో ఏర్పాటు చెయ్యగలవా? లేక నోటీస్ తక్కువని పేచీ పెడతావా?"

"తప్పదంటారా సార్?"

"తప్పదయ్యా. నువ్వే ఆదుకోవాలి ఎలాగో!"

"ఓకే సార్. నేను ఫోన్‌చేసి చెబుతాను సార్. మీరు అంబర్‌పేటకి ఎవరన్నా లేడీస్‌ని కారిచ్చి పంపగలరా సార్?"

"దాటవెయ్యకు. పక్కాగా ఏర్పాటుచేసి మళ్ళా నాకు ఫోన్ చెయ్యి."

"ఓకే సార్, అలాగే సార్."

"థాంక్యు."

"సార్—!"

"ఎస్—?"

"నాకో ప్రాబ్లెం ఉంది సార్. మీరే దాన్ని టాకిల్ చెయ్యాలి సార్."

"రేపు ఆఫీసుకి రా. మాట్లాడదాం."

"రేపటిదాకా నేనే ఉండకపోవచ్చుసార్."

"అలాగా. అయితే మీ బాస్‌తో ఏదైనా ట్రబులా?"

"అవును సార్ నాకు వన్‌మంత్ నోటీస్ యిస్తున్నారు సార్."

"ఇస్తున్నారా, ఇచ్చారా?"

"టైపు అయింది. టైపయినట్టు నాకు తెలిసిన సంగతి వారికి తెలీదు సార్."

"లలిత చెప్పిందా?"

"నో సార్ కార్బన్ పేపర్ చెప్పింది సార్."

నవ్వు. "దేవాంతకుడివిరా నాయనా.... సరే. టైమవుతోంది.... నేను ఫోన్ పెట్టేస్తాను. నువ్వు మళ్ళా అయిదు నిమిషాల్లో ఫోన్ చెయ్యి."

"ఎస్. సార్. నావని మర్చిపోకండి సార్. మీరే అంటారు కదా సార్. పువ్వులతో పూజచేసినా, కన్ను కోసి ఇచ్చినా, భక్తుడి ధ్యేయం మోక్షమే అని—?"

"చెప్పానుగా, ముందు పని చూడు."

* * *

రాత్రి పదకొండు గంటలు కావస్తోంది.

సికింద్రాబాదులో ఒక పెద్ద భవంతి. అది.

మూడో అంతస్తులో ఏ. సీ. చేసిన పెద్ద హాలు—

కూర్చున్నారు ముగ్గురు—

ముగ్గురివీ మూడు భాషలు. అయినా, వ్యాపారమే భాష. పరిశ్రమే పరిభాష— వారికి.

ఒకాయన బొంబాయిలో ఒక పెద్ద మెటల్ ఫ్యాక్టరీ అధినేత. పేరు రత్నాకర్.

రెండో ఆయన ప్రభుత్వంలో చిన్నతరహా పరిశ్రమల శాఖలో ఒక ఉన్నతోద్యోగి. పేరు ఎస్. వి. సేలం.

మూడో ఆయన పశ్చిమగోదావరిజిల్లాలో ఒక అతి ధనిక గ్రామానికి చెందిన మోతుబరి. పేరు రామచంద్రరాజు.

ఈ మేడ ఈయనదే.




టీపాయ్‌మీద పన్నెండువందల రూపాయలు ఖరీదు పెట్టి కొన్న స్కాచ్ మద్యం సీసా. ఇంకెంతో లేదందులో.

అరగంట క్రితం దాకా విరామం లేకండానే "భరాయించారు." కాని అసలు ఆ పార్టీ యిస్తున్న కారణం అప్పుడు బయట పడింది. అంతే; మందగించింది.

దూరంగా పెద్ద టేబిలుమీద సర్వసమాహారమైన ఆహారం "చల్లారిపోతున్నానర్రా" అని ఘుమఘుమల్తో ధుమధుమలాడుతున్నా సరే.

"ఆలోచించు. వయసుచేత, చదువుచేత నిన్న పుట్టిన పాపాయివి కాదు. కాని బిజినెస్ లెక్క ప్రకారం నువ్వు పాలుతాగే పసిపాపవే." అన్నాడు అధికారి.

"కె. కె. మెటల్స్ లిమిటెడ్" వారు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోడం ధ్యేయంగా హైదరాబాదులో ఆఫీసుపెట్టారు. ముడిసరుకు సరఫరాచేసే వాళ్ళెవరు, తయారైన సరుకు వాడకందార్లెవరు— అంటూ అన్వేషిస్తున్నారు.కుదిరినవాళ్ళతో కాంట్రాక్టులు వ్రాసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ పనిఅంతా వ్యాపారంలో భాగస్వామ్యం అంటూ లేని ఉద్యోగులతోనే చేయించేద్దామని కె.కె. మెటల్స్ లిమిటెడ్ యాజమాన్యం అత్యాశకు పోతున్నది.

అలాకాకుండా,మెటలర్జీ చదివినకొడుకు, జియాలజీ చదివిన అల్లుడు, బిజినెస్ మేనేజిమెంటు చదివిన తమ్ముడు,పలుకుబడీ పెట్టుబడీ యిబ్బడి ముబ్బడిగావున్న రామచంద్రరాజుగారు ఈ వ్యవహారాలన్నీ చూస్తామంటున్నారు. ముడిసరుకు కొనేటప్పుడు అయిదుశాతం, తయారైన సరుకు అమ్మేటప్పుడు పదిశాతం తమ కమిషన్ క్రింద యిచ్చేస్తే సంవత్సరానికి అరవై లక్షల టర్నోవరు తెస్తామంటున్నారు. "ఇంకా ఎక్కువ తెస్తాం, ఎందుకంటే మాకేలాభం కదా" అంటున్నారు. ఈ రేట్ల చొప్పున అయిదేళ్ళ కాంట్రాక్టుకి ఇప్పుడు ఇలా సిద్ధమే నంటున్నారు. మాపని అంతా పన్లు చేయించడమే తప్ప సరుకు చేత్తో ముట్టుకోం. ఆ మాటకొస్తే కళ్ళతో చూడం అంటున్నారు.

ఈ ఆఫీసు, దాని అద్దె నిర్వహణ, సిబ్బంది జీతాలు, ఇతర ఖర్చులు, మధ్య మధ్య వచ్చిపోతూ వుండడం ఈ చీదర అంతా వుండదు. ఈ రెండేళ్ళ కృషికి ఫలితంగా ఆనందరావు చేతినుంచి ఇవాళ ముప్ఫయ్యారు లక్షల టర్నోవరు తెచ్చే బేరాలు వస్తున్నాయి. పై ఏడాది ఇది యాభై లక్షలు కావచ్చు. కాని రాజుగారు ఇప్పుడే అరవై లక్ష లంటున్నాడే!

"మరి ఆయనికి ఆలోచించుకోటానికి టైమియ్యాలండి సేలం గారండి. కంగా


రెట్టే కూడదండి! వారికి మాత్రం తెలీదేంటండి. ఈ పుర్రాకులన్నీ వడి బిజినెస్ సంపాదించుకోటం దాని ఆటూపోటూ తట్టుకోటం తెలిక్కో. లేకుంటే అంతా మనమీద పడేసి దానికి పప్పంచేజీ ఇచ్చేటం తెలిక్కో? అంచాత మేం మనవిజేసేదేంటంటేనండి— వారికి విశ్రాంతి యియ్యాలండి. మొన్ననగా బొంబాయిలో బైలుదేరారా మరి? నిన్నా మొన్నా ఢిల్లీలో హైరాణా పడ్డారు గదుండి. మరి ఇవాల్టికిక్కడ చేరారే గానండి. ఊరికే కూర్చున్నారంటారా? పగులస్తమానం వారి స్కీములనండి. ప్రాజెక్టులనండి. అయ్యన్నీ జాగర్తగా సదివి బోదపచ్చుకున్నారా మరి! మరి బెరై పోరేంటండి?.... మరంచేతండి. మేం మనవిజేసేదేంటంటేనండి. ఆ సీసాలోది కాస్తా అవగొట్టేశండి. ఆకలేసిన కాడికి బొంచేశండి. ఆ పక్క గదిలా కొంచెపు కిష్టా రామా అనుకొని, రెస్టు దీసుకుని ఆనిక వారి బంగళాకి వారెళ్ళి పోవాలండి. మిగతా సంగతులు మాట్లాడేదింక రేపేనండి." అని కార్యక్రమం రూపొందించాడు రామచంద్రరాజుగారు.

"అఫ్‌కోర్స్!" సీసా అందుకుని తన గ్లాసులో కొద్దిగాను. మిగిలిన రెండుగ్లాసుల్లో మిగిలింది చెరిసగమున్నూ వంచేశాడు రత్నాకర్. "ఈ కొద్ది ఔషధం పుచ్చుకోగలను. ఆకలి వేస్తోంది గనకా, భోజనం చెయ్యకపోతే మీరు నొచ్చుకుంటారు గనకా. ఆహారం విషయంలోకూడా నా నియమాల్ని కొద్దిగా సడలిస్తాను. మరి మీరేదో క్రిష్టా రామా అన్నారే. అది మాత్రం నేను—" ఆపైన మాట్లాడలేక తల అడ్డంగా ఆడించాడంతే.... అప్పటికే చిన్నవైపోయిన ఐస్ ముక్కలతో ఆ ద్రవాన్ని గిలకరించి గుటక వేసేశాడు మరుక్షణం.

"అదికాదు రత్నా." చాలా నెమ్మదిగా చెప్పాడు సేలం. "నువ్వు చూసితీరాలి. రియల్ బ్యూటీ"అని పెంకెతనంగానవ్వాడు. రాజుగారు భోజనం టేబిల్ దగ్గిరకి దారితీశారు. ఇద్దరూ "రాజ"మార్గం పట్టారు.

మరికొంతసేపు గడిచాక రత్నాకర్ అన్నాడు- "నేను గత రెండు నెలలుగా ఒక ప్రశ్న గుండెల్లో పెట్టుకుని సమాధానం కోసం వెతుకుతున్నాను. ఒక సంస్థకి మంచి చేసే ప్రయత్నంలో, ఆ సంస్థకి సంబంధించిన ఒక ముఖ్యమైన వ్యక్తి పెడమార్గం తొక్కవలసి వస్తే ఆ వ్యక్తిది తప్పా, ఒప్పా?"

"మా తెలుగులో ఒక సామెత వుందండి. సిగ్గూ లజ్జా వదిలేస్తే మూడులోకాలు జయించవచ్చు నంటండి. ఈ రోజుల్లో నండి. బాగుపడాలన్నా ఒకర్ని బాగు జెయ్యాలన్నా కూడా నండి. వాటిచే దారండి.




సిగ్గూ లజ్జా కాశీలో వదిలెయ్యాలండి."

ఆ నుడికారం భావం అంతా నవ్వుతూ బోధపరచి చెప్పాడు సేలం.

"అదికాదు. ఇప్పుడు మా పి. ఆర్. ఓ. ఆనందరావు వున్నాడనుకోండి. అతను మా సంస్థలో ఉద్యోగి. సంస్థకి బిజినెస్ తేవడం, దాన్ని ముందుకి తేవడం అతని డ్యూటీ. అయితే అతను ఆ పనిమీద వుండి ఏం చేస్తున్నాడు? అడ్డమైన వ్యాపారస్తులకీ అంతకంటె హీనులైన ప్రభుత్వోద్యోగులకీ లంచాలుపెట్టి పార్టీలు యిచ్చి. ఆఖరికి విధివంచితురాలు, సోదరి వంటిది అయిన సాటి ఉద్యోగస్తురాల్ని ఎరగా పెడుతున్నాడు! ఇది న్యాయమా? ఇదే న్యాయమా? చెప్పండి!"

చివరి మాటలు బిగ్గరగా వచ్చాయి రత్నాకర్‌కి.

సేలం కాసేపు తినడం మానేసి "నెమ్మది, రత్నా! నెమ్మది!" అని రత్నాకర్ వీపు తట్టాడు.

రత్నాకర్ మళ్ళీ గొంతు పెంచి అన్నాడు- "పోనీ నేనున్నాననుకోండి. మా సంస్థ లిమిటెడ్ కంపెనీ కదా. షేర్ హోల్డర్స్ జనరల్ బాడీ అంతా మమ్మల్ని కొందర్ని డైరెక్టర్లుగా పెట్టుకున్నారు. డైరెక్టర్లందరూ నన్ను చేర్మన్‌గా వుండమన్నారు. కంపెనీకి లాభాలు సమకూర్చడానికి రుజుమార్గం కంటె అడ్డదారి చిన్నదికదా అని— మా వ్యాపారం అంతా మీ చేతుల్లో పెట్టేసి-మీరు పోసిన స్కాచ్ విస్కీతో కంఠంపోసి-అదే కంపెనీకి బలం అని సరిపెట్టుకోడమా న్యాయం? పక్కగదిలో ఎవర్నో తెచ్చి దాచినట్టున్నారు. ఆ బురదగుంటలో మునిగి అదే కైవల్యం అనుకొని కంపెనీని మీకు అమ్మెయ్యడమేనా నేనవలంబించవలసిన న్యాయం?"

"రత్నా: మై ఫ్రెండ్! నువ్వు వయసుకి మించిన మాటలు మాట్లాడుతున్నావు! కంట్రోల్ చేసుకో." అని రత్నాకర్ భుజంమీద చెయ్యివేసి నొక్కాడు సేలం.

"రాస్కెల్! ఎవడ్రా నువ్వు నన్ను అదిమిపట్టడానికి? వదుల్రా! లంచగొండి పందీ! ఈ బొద్దింకల రాజుగాడు ఈ రాత్రికి నన్నిక్కడ సెట్ చేసినందుకు ఏమిచ్చాడ్రా నీకు?" అని అరుస్తూ, నిటారుగా నుంచుండి పోయాడు రత్నాకర్.

"ఇదేటండోయ్. తొండముదిరి ఊసర వెల్లి-" అన్నారు రామచంద్రరాజుగారు.

"ఏంటయ్యా. నువ్వనేది? అసలు నువ్వెవడివి, నా బిజినెస్ అంతా ఇచ్చేమస డానికి? నీమాత్రం వ్యాపారం మేమూ చెయ్యగలం! నువ్వంటే పంట పొలాల్లోంచి డబ్బొస్తే ఏంచెయ్యాలో తెలీక కొట్టుకుంటున్నావు గానీ మేం తరతరాలనుంచీ బిజినెస్ లోనే ఉన్నాం! అంతగా కొవ్వెక్కిపోతే పో. మద్రాస్ పోయి సినిమాలు తీసుకో........"

అంతేగాని నువ్విచ్చే పార్టీలకి తార్చే బురదపందులకీ దాసోహం అని బిజినెస్సంతా నీకు తాకట్టు పెట్టడానికి వీడెవడనుకున్నావ్?" అని గుండెమీద బాదుకుంటూ "వీడు రాధాకాంత్ కొడుకు రత్నాకర్ రా!" అని తను యింతసేపూ కూర్చున్న కుర్చీని బల్లకిందికి తోసేశాడు.

రాజుగారు, సేలంగారు నిర్ఘాంతపడిచూస్తూ ఊరుకున్నారు. తగ్గు తగ్గని చెప్దామని సేలం కనిపించించిగాని యింకా రెచ్చిపోతాడేమోనని ఊరుకున్నాడు.

రత్నాకర్ వెంటనే పక్కగది వైపు జోరుగా అడుగులేస్తూ వెళ్ళాడు. "ఉండండి. మీకింకా బుద్ధి చెప్పాలి!" అని తలుపును ధడాలున తన్నాడు.


అరుపులు వినవడుతున్నాయి గదిలోకి. కాని స్పష్టంగా వినవడ్డంలేదు.

అసలు అరుస్తున్న దెవరో తెలియడం లేదు స్పష్టంగా.

ఈ అరుపుల పరిణామం ఏమిటో అంచనా తేలడం లేదు.

అలా దిగ్భ్రాంతితో తలుపు పక్కన చెవిపెట్టి వింటున్న లలిత, రత్నాకర్ తలుపును తన్నగా అది తగిలి, పక్కవాటుగా కింద పడిపోయింది.

వెలుతురులో ఆమెని చూసేసరికి రత్నాకర్‌కి నాలుగు వందల రూపాయల విస్కీ నిషా ఒక్కసారిగా దిగిపోయింది. చటుక్కున ఆమె చెయ్యి వదిలేసి. "నువ్వా?.... ఇక్కడికెలా వచ్చావు? యు!"అని మాత్రం అన్నాడు. ఆపైని అతనికి నోట మాట రాలేదు. ఉన్నవాడు ఉన్నట్టుగా ఉన్నచోట చతికిల్లా పడిపోయాడు. అతని మొహంలో ఆ క్షణం చోటు చేసుకున్న భావం కరుణకీ జుగుప్సకీ మధ్యనుంది. అతని గుండెలోది




దుఃఖమో, నిస్పృహో, నిర్వేదమో వైరాగ్యమో, ఉన్మాదమో తెలియని విధంగా, అతను తన మాతృభాష అయిన రాజస్థానీలో ఏదేదో గొణుక్కుంటున్నాడు.

"వీడికి పిచ్చెక్కుతుంది కాబోలు తెల్లారే సరికి" అన్నాడు సేలం దగ్గిరగా వచ్చి.

రత్నాకర్ ఎవరివైపూ చూడకుండా, "అమ్మా లలితా!" అన్నాడు. లలిత తన బాధ మరచి అతని మీదికి కొద్దిగా వంగింది. "నాకు మనసంతా చినిగిపోయిందమ్మా. నా శరీరం కూడా ఆట్టే స్వాధీనంలో లేదు. వీళ్ళ మధ్య ఇంకొక్క నిమిషం కూడా నేనుండలేను!.... నీకు ఆజన్మాంతం కృతజ్ఞుడినిగా వుంటానుగానీ, నన్నిక్కణ్ణించి మన ఆఫీసుకి తీసుకుపోయి అక్కడ విడిచిపెట్టగలవా?... ఇంత రాత్రప్పుడు టాక్సీలు దొరకవనుకుంటాను ఈ మూల. పోనీ ఓ ఆటో రిక్షా పట్టుకొని అయినా సరే .... అక్కణ్ణించి నువ్వెలా వెడతావో, మీ ఇంటికి—.... నాకేం తోచడంలేదు!"

ఆ పిలుపులో, ఆ మాటల్లో, ఏ అపేక్షలు కురిశాయనుకుందో, ఏ ఆత్మీయతలు పెనగొన్నాయని తలచిందో తగిలిన దెబ్బను తిట్లను ఆ క్షణంలో మరచిపోయి—లలిత అతన్ని లేవదీసింది. అతనిచేతిని తనబుజం మీద వేసుకొంది. అలాగే ఇందాక తను పడిపోయిన గదిలోకెళ్ళి తన చెప్పులూ బ్యాగూ తగిలించుకొంది. తమవైపు నిర్ఘాంతపోయి చూస్తున్న రామచంద్రరాజు, సేలం గార్లవైపు ఒక్కసారి మాత్రం చూసి రత్నాకర్‌ని మెట్లమీదుగా ఆ మూడంతస్తులూదింపి క్రింది వరండాకి చేర్చింది.

అక్కడ ఆగాడు రత్నాకర్ ఆమె బుజం మీంచి తన చేతిని తీసేసుకున్నాడు మెట్లవైపు చూశాడు.

"వాళ్ళిద్దరూ" నెమ్మదిగా అడుగులేసుకుంటూ తమ వెనుకనే వస్తున్నారు.

రెండుసార్లు ఊపిరిపీల్చి వదలి రత్నాకర్, "ఈ కుక్కలికి వాళ్ళ యెంగిలి మాంసం ముక్కలు తిరిగిచ్చేయమ్మా" అన్నాడు.

లలిత అర్థం కాలేనట్లు చూసింది.

రత్నాకర్ ఆమె బుజాన వ్రేలాడుతున్న ఎర్ర వాలెట్-కమ్-వేనిటీ బ్యాగ్‌ని లాగాడు దాని నోరు తెరిచి అందులోంచి క్రూరంగా చూస్తున్న కొత్త అయిదుతూపాయలనోట్ల కట్టనుతీసి, మెట్ల మీదికి విసిరేశాడు.

* * *

మర్నాటు ఉదయం—

ఎనిమిదిన్నరైంది టైం—

"మే ఐ కమిన్ సర్?" అంది లలిత, చేతిలో షార్ట్‌హాండ్ నోట్ బుక్కు, పెన్సిలూ పుచ్చుకుని.

"ఎస్, ప్లీజ్!" అన్నాడు రత్నాకర్. "చెప్పిన టైమ్‌కి వచ్చావు. థాంక్స్- ఈ లెటర్ తీసుకో—"

లలిత, వ్రాయడానికి సిద్ధంగా కుర్చీలో కూర్చుంది.

"శ్రీ వి. సచ్చిదానందరావుగారికి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, రీజియనల్ ఆఫీస్, హైదరాబాద్.

డియర్ సర్!

హైదరాబాదు రీజియనల్ ఆఫీసు పి.ఆర్.ఓ.గా మా కంపెనీ వ్యాపారం అభివృద్ధి చేయడానికి మీరు చేసిన, చేస్తున్న కృషి విషయంలో మంచీ చెడూ అన్నీ కూడా మాకు మా ఆప్తుల ద్వారా ఎప్పటికప్పుడు తెలియవస్తూనే వున్నాయి. ఇవి రుజువుకు దొరక్కపోయినాసరే, మాకు నమ్మకమంటే నమ్మకమే.

మీరు కేవలం నాలుగు నెలల కాలంలోనే సుమారు ముప్ఫయ్యయిదు లక్షల రూపాయల టర్నోవరు చూపే బిజినెస్‌ని మాకు రూఢి చేయడం ఎంతో సంతోషంతో స్వీకరించేదే అయినా, దీనికోసం మీరు అవలంబించిన నీచమైన మార్గాలను అంత అసహ్యంతోనూ మేము గర్హిస్తున్నాము. ఇందులో మీకు మిక్కిలి ఉపయోగకరంగా తోడ్పడిన వ్యక్తి కూడా మన ఉద్యోగి కావడం మాకు మరింత అసహ్యంగా ఉంది.

మనది కేవలం వ్యాపార సంస్థే- లాభాల ఆర్జనే మన ధ్యేయం, అయినప్పటికీ కనీస పరిమాణంలో అయినా నీతి నిజాయితీలు పాటించడం మన కర్తవ్యం అనీ, ధర్మమనీ హెచ్చరిస్తూ నేటి నుంచి అయినా మిమ్మల్ని మీరు దిద్దుకోగలరని ఆశిస్తూ మీకీ లేఖ వ్రాయడమైనది.

గౌరవ పురస్సరంగా:

మీ స్నేహపాత్రుడు,
కె. కె. రత్నాకర్,
ఛేర్మన్."

టెలిఫోన్ మీద వున్న బటన్ నొక్కి, ఆనందరావును రమ్మని చెప్పి, "మూడు కాపీలు, క్విక్!" అని లలితకు చెప్పాడు రత్నాకర్. లలిత వెళ్ళగానే వచ్చిన ఆనందరావుతో, "మిస్టర్ ఆనందరావ్! నిన్న రాత్రి నా కొక ప్రతిపాదన వచ్చింది. ఈ రీజియనల్ ఆఫీసు పూర్తిగా ఎత్తేసి, ఆంధ్రప్రదేశ్‌లో కె. కె. మెటల్స్ ఏమేమి చెయ్యగలదో అదంతా ఒక కాంట్రాక్టర్‌కి వప్పగించడానికి. వారు మా కంపెనీకి ఏడాదికి అరవై లక్షల మేరకు బిజినెస్ చూపించడానికీనూ. అయితే ముడిసరుకు కొనుగోలులో అయిదు శాతం, తయారైన సరుకు అమ్మకంలో పది శాతం కమిషన్ అడుగుతున్నారు వారు. దీన్ని కాగితంమీదపెట్టి ఈ పద్ధతిలో లాభనష్టాలు తేల్చి చెప్పండి. అర్జంటుగా!" అన్నాడు రత్నాకర్, కుర్చీలో వెనక్కి వాలబడుతూ.

ఉత్తరం మూడు కాపీలు టైపుచేసి లలిత తీసుకొచ్చి ఇచ్చింది. చదివి సంతకం పెట్టేసరికి ఆనందరావు "పర్సంటేజి ఇస్తే ఏడాదికి అధమపక్షం ఐదు లక్షల ఇరవై వేలు కాంట్రాక్టర్‌కి ముట్టచెప్పాల్సి వస్తుంది సార్. ప్రాంతీయ ఆఫీసు వుంచేస్తే సిబ్బంది, నిర్వహణ, అద్దెలు, టెలిఫోన్, ప్రయాణ భత్యాలు, సాదర్లు వగైరా అన్నీ కలిపి అత్యధిక పక్షం ఒకలక్ష నలభై ఎనిమిదివేలు సార్. అంటే తేడా మూడులక్షల డెబ్భయి రెండువేలు కంపెనీకి మిగులు సార్" అని కాగితం చదివాడు.

"కనక" అని తలచి రత్నాకర్ వాళ్ళిద్దరికీ ఆ టైపు కాగితాలు చెరొకటీ యిచ్చి "అందినట్టు సంతకాలు చెయ్యండి దీని మీద" అని మూడోకాపీ అందించాడు.